

వడ్డీ వసూలు సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం

డ్వాక్రా సభ్యులకు ఎపిఎం హామీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

రెడ్డి గణపవరం ఎస్‌బిఐ బ్యాంకులో జరిగిన నిర్లక్ష్యం కారణంగా గ్రూపు సభ్యులకు తెలియకుండానే రూ.లక్షల వడ్డీని చెల్లించిన వైనంపై మండల ఎపిఎం పద్మావతి గాదిరెడ్డి గ్రామం డ్వాక్రా గ్రూపు సభ్యులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి ఈ నెల 19న తేదీ సోమవారం బ్యాంకుకు వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రూపు సభ్యులకు ఎటువంటి నష్టం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆమెతో పాటు సిసి విజయ, గ్రామ సంఘం సభ్యులు ఉన్నారు.



డ్వాక్రా సభ్యులతో మాట్లాడుతున్న ఎపిఎం

రేషన్ కార్డుల కష్టాలు..!

- ఉదయం నుంచి సాయంత్రం వరకూ సర్వర్ డౌన్‌లోనే
- ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగెత్తిపోతున్న జనం
- అందుబాటులోకి రాని 'మనమిత్ర' వాట్సప్ సేవలు
- ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 9,142 దరఖాస్తులు
- అత్యధికంగా కొత్త సభ్యుల చేర్పుల దరఖాస్తులు 6,673
- ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా 'పశ్చిమ' సివిల్ సప్లరు అధికారుల తీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు చేసుకునేందుకు జనం పడుతున్న కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సర్వర్ పనిచేయకపోవడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రిపూట, లేక తెల్లవారుజామున సర్వర్ పనిచేయడంతో ఆ సమయంలో వచ్చి పని చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నెల ఏడో తేదీన నుంచి కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. అప్పటి నుంచి సర్వర్ సమస్య వెంటాడుతున్నా పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాలా కాలంగా కొత్త రేషన్‌కార్డులు జారీ లేకపోవడం, రేషన్ కార్డుల చేర్పులు, తొలగింపు వంటివి చేయకపోవడంతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రేషన్‌కార్డుల జారీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో అర్హులందరూ గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న పరిస్థితి నెలకొంది. ఈనెల 15వ తేదీ నుంచి మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం చెప్పినా అమల్లోకి రాలేదు. దీంతో రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకునే వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త రేషన్‌కార్డులతోపాటు మొత్తం ఏడు సేవలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరుగుతోంది. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ 9,142 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కొత్త రైస్ కార్డుల దరఖాస్తులు 959, ఉన్నకార్డుల్లో విభజనకు సంబంధించి 658, కొత్త సభ్యుల చేర్పు దరఖాస్తులు 6,673, మరణించిన సభ్యుల తొలగింపు 260, తప్పు ఆధార్ సీడింగ్ సరిచేసేవి 93, కార్డుల సరెండర్‌కు సంబంధించి 11, చిరునామా మార్పు దరఖాస్తులు 177 వరకూ వచ్చాయి. సర్వర్ సక్రమ పనిచేస్తే ఈపాటికి రేషన్‌కార్డుల దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యే పరిస్థితి ఉండేది. సర్వర్ పనిచేయకపోవడంతో తీవ్ర ఆలస్యం జరుగుతోంది. జూన్‌లో కొత్త రేషన్‌కార్డుల మంజూరు ఉంటుందని పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. సర్వర్ సమస్యతో కొత్త రేషన్‌కార్డులు ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



ఒంటరి మహిళలకు సంబంధించి స్పష్టత కరువు

కొత్త రేషన్‌కార్డుల ప్రక్రియ సాగుతుండడంతో ఒంటరి మహిళలు దరఖాస్తులు చేసుకునేందుకు వెళ్తున్నా నిరాశే మిగులుతోంది. ముఖ్యంగా వివాహమై భర్తకు ఏళ్ల తరబడి దూరంగా ఉంటున్న ఒంటరి మహిళలకు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరగడం లేదు. విడాకులకు సంబంధించిన వివరాలు ఉండాలంటూ చెబుతున్న పరిస్థితి నెలకొంది. భర్త నుంచి దూరమయ్యే అనేక మంది మహిళలు ఒంటరిగా పిల్లలతో జీవిస్తున్నారు. విడాకుల కోసం తిరగలేక, ఆర్థిక స్తోమత లేక అలానే ఉండిపోయారు. అలాంటి ఒంటరి మహిళలకు కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించకుండా ఆంక్షలు విధించడం ఏంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేలా 'పశ్చిమ' పౌరసరఫరాల శాఖ అధికారులు

కొత్త రేషన్‌కార్డులకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ సాగుతోంది. ఈ ప్రక్రియను పర్యవేక్షించే ప్రక్రియ అంతా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోంది. పశ్చిమగోదావరి జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు మాత్రం తమకు సంబంధం లేదన్నట్లు మాట్లాడుతున్నారు. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుల వివరాలు తమకు తెలీదని, రాష్ట్ర కేంద్రంలో ఉంటాయంటూ సమాధానం చెబుతున్నారు. మిగిలిన జిల్లాల పౌర సరఫరాల శాఖ కార్యాలయాల్లో సమాచారం ఉన్నప్పుడు పశ్చిమగోదావరి జిల్లా అధికారుల వద్ద ఎందుకు ఉండదో తెలియని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుల దరఖాస్తులకు సంబంధించిన సమాచారం మీడియాకు చెప్పకుండా దాటవేత ధోరణితో మాట్లాడుతున్నారు. ఇది ఒకరకంగా ప్రభుత్వానికి చెడ్డపేరు తేవడమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన ప్రక్రియ ఏవిధంగా సాగుతుందో ప్రభుత్వం ఏంచేస్తుందో వంటి వివరాలు ప్రజలకు తెలిసినప్పుడే పాలనపై జనంలో ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. లేకపోతే ప్రభుత్వం ఏం చేస్తుందో ప్రజలకు తెలియకుండా పోతుంది.



దీక్షలో పాల్గొన్న నేతలు

కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలి

మోండలీజ్ కంపెనీ కార్యాలయం ఎదుట దీక్ష

ప్రజాశక్తి - దెందులూరు

కోకో రైతుల సమస్యలు పరిష్కరించాలని, కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలని కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో సోమవరప్పాడు జాతీయ రహదారి వద్ద మోండలీజ్ కంపెనీ కార్యాలయం, గోడౌన్ వద్ద కోకో రైతుల దీక్ష శనివారం దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. చాక్లెట్ కంపెనీలు లక్షల కోట్లు లాభాలు గడిస్తూ కోకో సాగు చేస్తున్న రైతులను నష్టాలకు గురిచేయడం దారుణమన్నారు. కోకో గింజలకు రోజురోజుకూ ధర తగ్గించేయడం అన్యాయమన్నారు. ఇప్పటి వరకూ అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం కోకో గింజలు కొనుగోలు చేసి ఇప్పుడు ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. కంపెనీలు సిండికేట్‌గా మారి మార్కెట్ మాయాజాలంతో రైతులను మోసగించడం సహించరానిదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతుల సమక్షంలో చర్చలు జరిపి అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా కోకో గింజలకు ధర నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై.కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జోక్యం చేసుకొని విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేసి దేశీయంగా రైతుకు ధర కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కోకో రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో కిలో కోకో గింజలకు రూ.935 రైతులకు ధర చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్.గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పానుగంటి అచ్యుతరామయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గుదిబండి వీరారెడ్డి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కాసరనేని విద్యాసాగర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని కోకో రైతులు, కోకో రైతు సంఘం ప్రతినిధుల సమక్షంలో చర్చలు జరిపి ధర నిర్ణయ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడారు. కోకో రైతుల పోరాటానికి సంఘీభావం తెలిపారు.



కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తున్న నేతలు

కోకో గింజలు కొనుగోలు కంపెనీల కార్యకలాపాలు నిలుపుదల

కోకో రైతుల దీక్ష కార్యక్రమంతో పోలీసులు మోండలీజ్ కంపెనీ వద్ద మోహరించారు. పెదవేగి సిఐ, దెందులూరు ఎస్ఐ, కానిస్టేబుళ్లు తరలివచ్చారు. తహశీల్దార్ సుమతి సమక్షంలో మోండలీజ్ కంపెనీ మేనేజర్ రాజేష్ రామచంద్రన్‌తో రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు, రైతు సంఘాల నాయకులు చర్చలు జరిపారు. ఈ నెల 19న గానీ 20న గానీ ధర నిర్ణయంపై కంపెనీ యాజమాన్యం చర్చలకు వస్తారని ఆందోళన విరమించాలని కోరారు. అయితే అప్పటివరకు కంపెనీ కార్యకలాపాలు నిలుపుదల చేయాలని రైతు సంఘాల నాయకులు కోరగా అందుకు కంపెనీ మేనేజర్ అంగీకరించారు. ఏ కంపెనీ అయినా ట్రేడర్ అయినా తమ కార్యకలాపాలు కొనసాగిస్తే అక్కడ దీక్ష చేపట్టాలని కోకో రైతులు నిర్ణయిస్తూ తీర్మానం ఆమోదించారు. 19, 20 తేదీల్లో చర్చలు జరిపేందుకు అంగీకరించడంతో తాత్కాలికంగా దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో కోకో రైతుల సంఘం నాయకులు కోనేరు సతీష్ బాబు, పాలడుగు నరసింహారావు, గుర్రం మాధవ, పానుగంటి నరేష్, వంకినేని లక్ష్మీనారాయణ, డి.నరేష్, నాగరాజు శ్రీనివాసరాజు, కోకో రైతులు పాల్గొన్నారు.


ఏలూరు ఎఎంసి నూతన కమిటీ ప్రమాణస్వీకారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు అగ్రి కల్చర్ మార్కెట్ యార్డును అన్ని విధాలా అభివృద్ధి చేసి, మిగిలిన మార్కెట్ యార్డులకు దిక్సూచిలా నిలపాలని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ఆకాంక్షించారు. యార్డులో అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం ఏలూరు మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత పవర్‌పేటలోని తన స్వగృహం నుండి ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులైన మామిళ్లపల్లి పార్థసారథి మార్కెట్ యార్డు వరకూ భారీ ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం యార్డులోని వినాయకుని గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, వైస్ ఛైర్మన్ నడపన వాణి సూర్యకుమారితో పాటు ఇతర డైరెక్టర్లతో ఎంఎల్ఎ బడేటి చంటి ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జరిగిన సభలో గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ ఎంఎల్ఎ బడేటి చంటి సారథ్యంలో ఏలూరు మార్కెట్ యార్డు జిల్లాలోని అన్ని ఎఎంసిల కంటే ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ రైతు బిడ్డగా రైతుల సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న పార్థసారథి ఎఎంసి ఛైర్మన్‌గా నియమితులు కావడం శుభపరిణామమని తెలిపారు. ఆ పదవికి ఆయన వన్నె తెస్తారన్న విశ్వాసం తనకు పూర్తిగా ఉందన్నారు. మూడు పార్టీల కలయికతో బలంగా ఉన్న కమిటీని ఏర్పాటుచేయడం జరిగిందని, భవిష్యత్‌లో వీరంతా కలిసి, యార్డును అంతే బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. యార్డులో నెలకొన్న అన్ని సమస్యలనూ యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తానని, హమాలీలకు అత్యవసరంగా మారిన మరుగుదొడ్ల నిర్మాణాలను ఈ సంవత్సరాంతానికి, జింబో షెడ్ నిర్మాణాన్ని 2026 నాటికి పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం కల్పించాలన్నదే మూడు పార్టీల ఏకైక నిర్ణయమన్నారు. ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్-2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ సమర్థులైన మామిళ్లపల్లి పార్థసారథిని ఎఎంసి ఛైర్మన్‌గా నియమించడం హర్షణీయమని, ఆయన హయాంలో యార్డు సర్వతోముఖాభివద్ధి సాధిస్తుందన్న నమ్మకం ఉందని తెలిపారు. మాజీ ఎంఎల్ఎ అంబికా కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సమర్థుకు పదవులు ఇస్తున్నారన్నారు. ఎఎంసి ఛైర్మన్ పార్థసారథి మాట్లాడుతూ తనపై పూర్తి విశ్వాసం ఉంచి ఏలూరు అగ్రికల్చర్ మార్కెట్ యార్డుకు ఛైర్మన్‌గా నియమించిన సిఎం చంద్రబాబుకు, మంత్రి నారా లోకేష్‌కు, ఎంఎల్ఎ బడేటి చంటికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రైతులకు అసలు సమస్యలే లేకుండా చేసేందుకు యార్డు తరపున పాటు పడతానన్నారు. నిమ్మకాయల వర్తకులు, హమాలీ కార్మికుల ఆకాంక్షలకు అనుగుణంగా యార్డు పేరు ప్రఖ్యాతలకు మరింత వన్నె తెచ్చే విధంగా శక్తివంచన లేకుండా శ్రమిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, డిప్యూటీ మేయర్లు వందనాల దుర్గాభవాని, పప్పు ఉమామహేశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, జనసేన నాయకులు నారా శేషు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



ఎఎంసి ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న పార్థసారథి



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎంఎల్ఎ, ప్రజాప్రతినిధులు, సభ్యులు

ఈదురుగాలులు, వర్షం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షానికి పలు గ్రామాల్లో వీధులు, అంతర్గత రోడ్లు జలమయం అయ్యాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షంతో రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులపై గోతులు ఉండటంతో వర్షపు నీరు నిలిచి చెరువును తలపించాయి. వడాలి -చిగురుకోట రోడ్డు తక్కువ ఎత్తులో ఉండటంతో వర్షపు నీరు రోడ్డుపై నిలవడంతో ఆప్రాంత వాసులు, వాహనదారులు అవస్థలు పడుతూ ప్రయాణం సాగించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో కురిసిన భారీ వర్షంతో ఖాళీ చేలు వర్షపు నీటితో నిండాయి.



పోలవరం : బైక్‌పై పడిన చెట్టు

పోలవరం : మండలంలోని శనివారం సాయంత్రం ఈదురుగాలులు, ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వీచిన ఈదురుగాలులకు పలుచోట్ల భారీ వృక్షాలు రోడ్లపై కూలి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ స్తంభాలు విరిగిపడి విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పోలవరం సెకండ్ రోడ్డులో ఒక ఇంటి వద్ద రోడ్డు పక్కన రావి చెట్టు పడిపోయింది. ఆ చెట్టు ద్విచక్రవాహనంపై పడడంతో ధ్వంసమైంది. బెస్తావీధిలో భారీ బూరుగు వృక్షం, బిసి కాలనీలో, ముప్పిరిశెట్టి వారి వీధిలో వేపచెట్లు విద్యుత్ స్తంభాలపై పడి విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం, పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రైతులు ఆందోళనకు గురయ్యారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మద్దతు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం కోసం మండల కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు పోలవరం మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో షెడ్యూల్ ప్రాంతంలోని అన్ని ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలకు ఇచ్చినట్లు తెలిపారు. జిఒ 3కి బదులుగా చట్టం చేసుకోవడానికి జగన్మోహన్ రెడ్డి ట్రైబల్ అడ్వజరీ కౌన్సిల్‌కు పూర్తి స్వేచ్ఛనిచ్చారని, టిఎసి ద్వారా షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియమాలు చట్టం కోసం అప్పటి ఎంఎల్ఎలమైన తామందరం తీర్మానం చేశామని, గవర్నర్ ఆమోదానికి పంపే లోపు ఎన్నికలు వచ్చాయని తెలిపారు. గిరిజన సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని, తద్వారా షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీల డిమాండ్లు నెరవేర్చకపోతే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దీక్ష పరులైన సర్పంచులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింప చేశారు. అనంతరం బుట్టాయగూడెం మెయిన్ సెంటర్‌లో ర్యాలీలో పాల్గొన్నారు. మూడో రోజు దీక్షలో సర్పంచులు కుంజా వెంకటేశ్వరరావు, మాల్సి వెంకన్నబాబు, తెల్లం వెంకమ్మ, ఉయికే బొజ్జి, జోడి సత్య దుర్గాప్రసాద్, తెల్లం రాముడు, తాటి సీత, తెల్లం జయమ్మ, పోడియం లక్ష్మి, రవ్వ చంద్రకళ, మడకం రామలక్ష్మి పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలో మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియమాకాల చట్టం వెంటనే చేయాలని, గిరిజన సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని, మెగా డిఎస్‌సిలో షెడ్యూల్ ప్రాంత పోస్టులను మినహాయించి ఏజెన్సీ ప్రత్యేక డిఎస్‌సి నోటిఫికేషన్ ద్వారా భర్తీ వెంటనే చేయాలని నినాదాలు చేస్తూ బుట్టాయగూడెం మెయిన్ రోడ్డులో ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో ఆదివాసీ ఐక్యకార్యచరణ కమిటీ ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి సోదెం ముక్కయ్య, జాయింట్ సెక్రటరీ తెల్లం లక్ష్మణరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ తెల్లం రవిప్రసాద్, ఎటిఎ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెల్లం రాములు, జిల్లా అధ్యక్షులు సరియం నాగేశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు సోదెంరాజు, జిల్లా ఉపాధ్యక్షులు తెల్లం గంగరాజు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంజా కృష్ణంరాజు, బుట్టాయగూడెం మండలాధ్యక్షులు రవ్వా బసవరాజు, ప్రధాన కార్యదర్శి పోడియం కొవ్వాడయ్య, కొండ్రెడ్ల సంగం పట్ల రమేష్ కుమార్ రెడ్డి, అఖిల భారత రైతు కూలీ సంఘం సరియం రామ్మోహన్, కారం రాఘవ, బన్నే వినోద్ పాల్గొన్నారు.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి

నూజివీడు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగమురళి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


ఈ నెల 15వ తేదీ స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ గడువు ముగిసిందని, ఎవరైనా ఫిట్‌నెస్ చేయించుకోని వారు ఉంటే స్కూల్ తెరిచేలోపు చేయించుకోవాలని నూజివీడు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగ మురళి తెలిపారు. నూజివీడు ప్రాంతీయ రవాణా శాఖ పరిధిలో సుమారు 120 ప్రయివేట్ పాఠశాలల బస్సులు ఉన్నాయని చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరంలో స్కూల్ బస్సులను నడపాలంటే ఆర్‌టిఎ అధికారుల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాల్సి ఉంటుందని తెలిపారు. ఆయా బస్సుల్లో మెడికల్ కిట్, డ్రైవర్, క్లినర్, ఫైర్ సర్టిఫికెట్, బస్సు తిరిగే రూట్ మ్యాప్ ఉండాలన్నారు. స్కూల్ యాజమాన్యం వారు ఫిటినెస్ సర్టిఫికెట్ కోసం ఆన్‌లైన్‌లో డాక్యుమెంట్స్ అప్‌లోడ్ చేసుకుంటే మిగతా ప్రక్రియ ఆర్‌టిఎ అధికారుల పర్యవేక్షణలో జరుగుతుందన్నారు. మద్యం తాగే అలవాటు, చూపు మందగించిన వారిని బస్ డ్రైవర్లుగా నియమించకూడదన్నారు. ఈ అంశాలన్నిటిని పర్యవేక్షించిన అనంతరం ఆర్‌టిఎ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. నిబంధనలు పాటించాలని సూచించారు. బస్సు ఎడమవైపు ముందు భాగంలో యాజమాన్యం వివరాలు పొందుపరచాలని, బస్సు బయలుదేరే సమయం, ఆగే స్థలాలు, రూట్ ప్లాన్ బస్సులో ఉండాలని, విద్యార్థుల సంఖ్య వారి వివరాలు బస్సులో ఉంచాలని తెలిపారు. సీట్ల సామర్థ్యానికి తగ్గట్లుగా విద్యార్థులు ఉండాలన్నారు. డ్రైవర్‌కు కనీసం ఐదేళ్ల అనుభవంతో ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రతినెల బస్సు కండిషన్‌ను యాజమాన్యం, పేరెంట్స్ కమిటీ తనిఖీ చేయాలన్నారు. బస్సులో ఫిర్యాదుల పుస్తకం ఉండాలన్నారు. ప్రతినెలా యాజమాన్యం పరిశీలించి ఫిర్యాదులు పరిష్కరించాలన్నారు. ఆర్‌టిఒ అధికారులు తెలియజేసిన సూచనల మేరకు ప్రతి స్కూల్ యాజమాన్యం వారి స్కూలు వాహనాలకు సంబంధించి నిబంధనలు పాటించాలని సూచించారు.

పరిశుభ్రత ప్రతిఒక్కరి జీవితంలో భాగం కావాలి

గుణ్ణంపల్లిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవితంలో ప్రధాన భాగం కావాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్రలో భాగంగా గుణ్ణంపల్లిలో శనివారం పలు కార్యక్రమాల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. అనంతరం పశువైద్యానికి సంబంధించి ఏర్పాటుచేసిన శిబిరాన్ని పరిశీలించి పశువులకు సంబంధించి మందులను పశుపోషకులు అందజేశారు. అలాగే స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని చెత్త నుండి సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. క్లాప్ మిత్రాలు, గ్రీన్ అంబాసిడర్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ప్రతి ఒక్కరీ జీవితంలో భాగం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తలను వేరుచేసి, ఇంటింటికి వచ్చి చెత్త సేకరించే వారికి అందించాలన్నారు. పారిశుధ్య కార్మికులు రోజూ ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించి, కంపోస్ట్ యార్డ్‌కు తరలించాలన్నారు. వేసవి వేడిమి నుండి ఉపశమనం ఎలా పొందాలనే అంశానికి సంబంధించి ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. జిల్లా అంతటా పరిశుభ్రత కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలన్నారు. జిల్లాను ఆరోగ్య జిల్లాగా, కాలుష్య రహిత జిల్లాగా తీర్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. గున్నంపల్లి గ్రామాన్ని స్వచ్ఛ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం క్లాప్ మిత్రలు కె.మహాలక్ష్మణుడు, కె.అనుగ్రహం, బి.బసవయ్య, గ్రీన్ అంబాసిడర్ కె.శామ్యూల్, పంచాయతీ కార్యదర్శి జి.రామలక్ష్మిలను కలెక్టర్ పూలమాల, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, ఎంపిడిఒ పివివి.ప్రకాష్, తహశీల్దార్ జెవి.సుబ్బారావు, అధికారులు పాల్గొన్నారు.



19న డిఆర్‌సి సమావేశం

జిల్లా అభివృద్ధిపై ఇన్‌ఛార్జి మంత్రి మనోహర్ సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా అభివృద్ధి సమీక్ష కమిటీ సమావేశం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన ఈ నెల 19వ తేదీ సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి, పార్లమెంట్ సభ్యులు, ఎంఎల్‌సిలు, ఎంఎల్ఎలు జిల్లా అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఇరిగేషన్ పూడికతీత పనులు, ఉపాధి హామీ, తాగునీరు సరఫరా, రెవెన్యూ, విద్య ఉద్యానవన, తదితర శాఖల అంశాలపై సమీక్షిస్తారని తెలిపారు.

పారదర్శకంగా కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియ

ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కానిస్టేబుల్ బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ తెలిపారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ కానిస్టేబుల్ సాధారణ బదిలీల ప్రక్రియ శనివారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 286 మంది కానిస్టేబుళ్లకు బదిలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రతాప్ శివకిషోర్ మాట్లాడుతూ ఒక్కొక్క పోలీస్ స్టేషన్‌లో ఐదేళ్ల పైబడి విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్ జాబితాను ముందుగానే తయారు చేసి వారిని బదిలీల కౌన్సిలింగ్‌కు పిలిచామని ఆయన తెలిపారు. మొత్తం 286 మంది కానిస్టేబుళ్లకు వారి వారి ఇష్టమైన ప్రదేశాలకు బదిలీలు నిర్వహించామని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులకు భోజన సదుపాయాన్ని కల్పించారు. కానిస్టేబుళ్లకు ఆయనే స్వయంగా వడ్డించారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.


వాటర్ ప్యూర్‌ఫైయర్ అందించిన లక్ష్మీభవాని

పిహెచ్‌సికి వాటర్ ప్యూర్‌ఫైయర్ అందజేత

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వేసవికాలం దృష్ట్యా రోగులకు స్వచ్ఛమైన తాగునీరు అందిండంతో పాటు వారి దాహార్తిని తీర్చడానికి వాసవి మహిళా మండలి సభ్యులు వాటర్ ప్యూరీఫైయర్ వితరణగా అందించడం ఎంతో అభినందనీయమని ఆగిరిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారిణి షేక్ టీనా అన్నారు. పిహెచ్‌సికి ఆగిరిపల్లి వాసవి మహిళా మండలి ఆధ్వర్యంలో ఆ సంఘ గౌరవ అధ్యక్షురాలు యండూరు లక్ష్మీ భవానీ చేతుల మీదుగా రూ.20 వేల విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను వైద్యాధికారి టీనాకు అందించారు. ఈ కార్యక్రమంలో వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు చలవాది శైలజ, కార్యదర్శి మానేపల్లి సునీత, ఆర్గనైజింగ్ సెక్రటరీ తవ్వా సృజన, ఉపాధ్యక్షురాలు యండూరు అలేఖ్య, జాయింట్ సెక్రటరీలు మడుపల్లి జ్యోతి, కల్పన, జయ, వైద్యాధికారి జగన్మోహనరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు సర్వీసు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం, బుట్టాయగూడెం మండలాలను కలుపుతూ రింగు రోడ్డు గ్రామాల మీదుగా ఆర్‌టిసి బస్సు సర్వీసు ప్రారంభించినట్లు జంగారెడ్డిగూడెం ఆర్‌టిసి డిపో మేనేజర్ పిపిడి.గంగాధరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి నరసన్నపాలెం, రామానుజపురం, వేదాంతపురం, కోయ రాజమండ్రి, రాయగూడెం, కమ్మర బొత్తప్పగూడెం, నిమ్మలగూడెం, కన్నాపురం, పులిరామ్మగూడేనికి సర్వీసు నడపనున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాల అనంతరం తిరిగి రెండు మండలాల గ్రామాలకు ఆర్‌టిసి బస్సు సర్వీసు ఏర్పాటు కావడం పట్ల సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు.

విధిగా వ్యాయామం చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రతిరోజూ వ్యాయామం చేయడం, మంచి ఆహారపు అలవాట్ల ద్వారా రక్తపోటును నివారించవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఆర్.మాలిని తెలిపారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.మాలిని మాట్లాడుతూ అధిక రక్తపోటు అనేక అనర్థాలకు దారి తీస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ, యుపిహెచ్‌సి పవర్‌పేట వైద్యాధికారి డాక్టర్ గౌతం, డిపిహెచ్‌ఎన్‌ఒ జ్యోతి, అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు పాల్గొన్నారు.

కారాగారం సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు శనివారం కారాగారాన్ని సందర్శించారు. నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు, ఆరోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. నిందితులను అందించిన ఉచిత న్యాయ సలహాలు, సహాయంపై ఆరా తీశారు. అందరూ బాధ్యతగా పని చేయాలని చెప్పారు. వంటశాల, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార పర్యవేక్షణ అధికారి కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్స్ టోకూరి వెంకటేష్, పిఎల్‌వి టివిఎస్.రాజు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

బయ్యన్నగూడెంలో వృద్ధులకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పలు సూచనలు చేశారు. వేసవిలో వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బకు గురైన వారు వెంటనే పిహెచ్‌సికి వచ్చి చికిత్స పొందాలన్నారు. వేసవిలో అందరూ తరచుగా ఉప్పు కలిపిన మజ్జిగ, కొబ్బరి బొండాలు, తాజా పండ్ల రసాలు తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

19 నుంచి మూల్యాంకనం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు మే 2025కు సంబంధించి సంస్కృతం, తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం, సివిక్స్ సబ్జెక్టుల మూల్యాంకనం ఈ నెల 19వ తేదీ సోమవారం నుంచి ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభం అవుతుందని ఇంటర్మీడియట్ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.యోహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ సారి సప్లమెంటరీ మూల్యాంకనం ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు కలిపి ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆరు సబ్జెక్టులకు నియమించిన చీఫ్ ఎగ్జామినర్లు సోమవారం ఉదయం పది గంటలకు, స్క్రూటినైజర్లు మంగళవారం ఉదయం పది గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్యాంపు ఆఫీసర్‌కు రిపోర్టు చేయాలని తెలిపారు. ఈ విధంగా రిపోర్ట్ చేసేలా వారిని రిలీవ్ చేయాలని జిల్లాలోని అన్ని కళాశాలల ప్రధాన అధ్యాపకులను ఆదేశించారు.

బాధిత కుటుంబానికి సాయం

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామానికి చెందిన పొడపాటి స్వామి దాసు ఇటీవల వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి టిడిపి నాయకులు గార్లపాటి నరసింహారావు రూ.ఐదు వేల నగదుతో పాటు రూ.రెండు వేల విలువైన నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి వర కిషోర్, చీలి అర్లప్ప, ఎంట్రపాటి రాంబాబు, ఎలవర్తి జయ, కలపాల దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ, ఆటో ఢీకొని ఒకరు మృతి

ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

లారీ, ఆటో ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండలంలోని వెంకటాద్రిపురం వద్ద శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... హనుమంతులగూడెం నుంచి నూజివీడుకు ఆటోలో ఆరుగురు వ్యక్తులు ప్రయాణిస్తుండగా మార్గమధ్యలో వెంకటాద్రిపురం వద్దకు వచ్చేసరికి ఆటో, లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న హనుమంతులగూడెం గ్రామానికి చెందిన అజయ్ అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. నూజివీడుకు చెందిన శ్రీనివాస్, సాయికిరణ్ ఇమ్రాన్, పవన్, ప్రశాంత్, అనే ఐదుగురు వ్యక్తులు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులకు నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదం గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... జంగారెడ్డిగూడెం డాంగేనగర్‌కు చెందిన వేములపూడి సత్యనారాయణ (37) కొయ్యలగూడెం వైపు నుంచి జంగారెడ్డిగూడెం వైపు బైక్‌పై వెళుతుండగా బయన్నగూడెం సమీపంలోని ఇటుకుల బట్టి వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోవడతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇండో-సాక్సన్‌లో అత్యుత్తమ విద్య, క్రమశిక్షణ

పది ఫలితాల్లో వరుసగా మూడోసారి మండల ప్రథమ స్థానం
స్కూల్ ప్రిన్సిపల్ మత్తతిల్ సాలీ, కరస్పాండెంట్ మట్టతిల్ జార్జ్

ప్రజాశక్తి - ముదినేపల్లి



ఇండో-సాక్సన్ స్కూల్

ఇండో-సాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ 2006లో స్థాపించనప్పటి నుంచి విజయ కేతనం జెండాను ఎగురవేస్తూ నిరూపితమైన ట్రాక్‌లో నడుస్తోందని ప్రిన్సిపల్ మత్తతిల్ సాలీ, పాఠశాల కార్యదర్శి, కరస్పాండెంట్ మట్టతిల్ జార్జ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. ఈ ట్రెండ్‌ను కొనసాగిస్తూ, గత రెండు సంవత్సరాలుగా పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో మండల స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించినట్లు చెప్పారు. ఈ ఏడాది కూడా కాగిత శృతి 600 మార్కులకు 590 మార్కులు సాధించడంతో ముదినేపల్లి విద్యా చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించిందని తెలిపారు.

పాఠశాలలోనే కోచింగ్...

విద్యార్థిని కాగిత శృతి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 54వ ర్యాంక్, రెసిడెన్షియల్ స్కూల్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 590 ర్యాంక్‌ను సాధించిందని తెలిపారు. ఈ రెండు పరీక్షలకు కోచింగ్ కూడా పాఠశాలలోనే ఏర్పాటు చేయడం పాఠశాల మరొక ప్రత్యేకత అని తెలిపారు. ముదినేపల్లి ప్రాంతంలోని చుట్టుపక్కల ఉన్న పాఠశాలల్లో కెల్లా ఇప్పటికే పాఠ్యాంశాలు, పాఠ్యేతర కార్యక్రమాలకు ఇండోసాక్సన్ హై స్కూల్ ప్రసిద్ధి చెందిందన్నారు. సాధారణ విద్యా కార్యక్రమాలతో పాటు, పాఠశాలలో నీట్-ఐఐటి ఫౌండేషన్ ప్రోగ్రామ్, సివిల్స్ ఫౌండేషన్ ప్రోగ్రామ్, అబాకస్, వేదిక్ మ్యాథ్స్, కాలిగ్రఫీ మొదలైనవి ఉన్నాయన్నారు.

ప్రేమ, ఆప్యాయత..

ప్రేమ, ఆప్యాయత అనేది పాఠశాల ట్యాగ్‌లైన్ అని తెలిపారు. క్యాంపస్‌లో ఒత్తిడి లేని, భయం లేని వాతావరణాన్ని యాజమాన్యం నిర్ధారిస్తుందన్నారు. ఆటలు, క్రీడల కోసం రోజువారీ సమయాలను కేటాయిస్తారన్నారు. క్రీడా, కళా, వార్షిక దినోత్సవం వంటి వార్షిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు.

పాఠశాల ప్రత్యేకత

వ్యక్తిగత శ్రద్ధ ఈ పాఠశాల మరొక ప్రత్యేకత అని చెప్పారు. విద్యాపరంగా బలహీనమైన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. విద్యార్థులు ఎల్లప్పుడూ నెమ్మదిగా, స్థిరంగా ముందుకు సాగడానికి, నైపుణ్యాలను సాధించడానికి పాఠశాల ప్రోత్సహిస్తుందన్నారు.

ఈ ఏడాది నుంచి కొత్త నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం

ఈ ఏడాది నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు విద్యార్థుల కోసం కొత్త నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగా, ప్రతి విద్యార్థి డ్రోన్ డిజైన్, సిమిలేషన్ లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఎంచుకోవచ్చని తెలిపారు. ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా ఉంటుందని చెప్పారు.

జులై నుంచి సెమీ-రెసిడెన్షియల్ వ్యవస్థ ప్రారంభం

వచ్చే జులై నుంచి పాఠశాల సెమీ-రెసిడెన్షియల్ వ్యవస్థను ప్రారంభిస్తున్నామని తెలిపారు ఈ వ్యవస్థలో, ట్యూషన్లు, ఆహారం అవసరమైన విద్యార్థులకు పాఠశాలలోనే అందించనున్నట్లు తెలిపారు. ఉదయాన్నే విద్యార్థులు తమ ఇళ్ల నుంచి బయలుదేరే ముందు, ఆహారం వండడానికి దానిని ప్యాక్ చేయడానికి ఇబ్బంది పడే చాలా మంది తల్లిదండ్రులుకు ఇది సహాయ పడుతుందన్నారు. పిల్లలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన, పోషకమైన ఆహారాన్ని మాత్రమే ఇస్తామని తెలిపారు.

'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర'లో భాగస్వాములు కండి

ప్రజాశక్తి - ఏలూరు



ఏలూరులో....

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఇంకుడు గుంట నిర్మాణ పనులు ప్రారంభించి, మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో జాయింట్ కలెక్టర్ స్వచ్ఛఆంధ్ర - స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడో శనివారం పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛత కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజలంతా భాగస్వాములు కావాలని జెసి ధాత్రిరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎన్ఎస్.కృపావరం, సెట్ వెల్ సిఇఒ కె.ప్రభాకర్, డ్వామా పీడీ సుబ్బారావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్య, జిల్లా కలెక్టరేట్ వివిధ విభాగాల సూపరింటెండెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు స్పోర్ట్స్ : మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మన ఆరోగ్యాలను సంరక్షించడమే కాకుండా ప్రజారోగ్యాలను సంరక్షించేందుకు మనం సహకారులమవుతావని ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్, అదనపు ఎస్‌పి సూర్యచంద్రరావు సంయుక్తంగా కార్యాలయ పరిసర ప్రాంతాలను శుభ్రపరచారు. కార్యాలయ ఆవరణలో ఇరువురు మొక్కలను నాటారు.

ఏలూరు సిటీ : ఏలూరును స్వచ్ఛ నగరంగా తయారు చేయడానికి ప్రజల భాగస్వామ్యం అవసరమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. స్వచ్ఛత విషయంలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏలూరు 42వ డివిజన్ కొత్తపేటలో బీట్ ద హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛతపై నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఈ శనివారం బీట్ ద హీట్ పేరుతో వేసవిలో ఉష్ణోగ్రతల పెరుగుదల, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి పాల్గొని మొక్కలు నాటి, స్వచ్ఛతపై ప్రజలకు పలు సూచనలు చేశారు. కమిషనర్ ఎ.భానుప్రతాప్ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. గతంలో తాను ఇచ్చిన మాటకు కట్టుబడి శానిటేషన్ నిర్వహణలో ఇతరులకు ఆదర్శప్రాయంగా విధులు నిర్వర్తించిన ముగ్గురు పారిశుధ్య కార్మికులకు రూ.ఐదు వేల చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని ఎంఎల్ఎ చంటి అందించారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో శనివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.నరేంద్రసింగ్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చి సేవలు పొందేవారు, వారితో వచ్చే అందరి కోసం దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఒ డాక్టర్ వి.శ్రీనివాస్, ఫిజీషియన్ డాక్టర్ పి.శ్రీనివాస్, అనస్తీసియా డాక్టర్ పద్మజారాణి, ఆర్థోసర్జన్ డాక్టర్ గోపీనాథ్, ఇఎన్‌టి స్పెషలిస్ట్ డాక్టర్ అజయ్, డాక్టర్ కీక్ర నాయక్ డెంటల్ సర్జన్ డాక్టర్ దినేష్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ అన్నారు. మండలం పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు నక్కనబోయిన సత్యనారాయణ, గద్దల సుహాసిని మోహన్‌రావు, పులి బళ్ల లక్ష్మీ సత్యనారాయణ, కొండేటి విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు నీరజ నాయుడు, కె.సుజాత, శ్రీనివాసచౌదరి, ఆరేపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నల్లూరి వెంకట చలపతి రావు పిలుపునిచ్చారు. మండలంలోని రాజుపోతేపల్లిలో ఉపాధి హామీ చట్టం పని వద్ద ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు బొంతు సత్యనారాయణ, టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : మూగ జీవాల దాహార్తిని తీర్చడం కోసం గ్రామాల్లో ఊరి చివరన ఏర్పాటు చేసిన నీటి తొట్టెలను పునరుద్ధరించడంతో పాటు నీటి సదుపాయాలు కల్పించాలని ఎంపిడిఒ బి.ఆనంద్‌బాబు కోరారు. సర్వాంధ్ర-స్వచ్ఛంధ్ర భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయడం, చలివేంద్రాల ఏర్పాటు, మూగజీవాల నీటి తొట్టెల నిర్వహణ, తడి, పొడిచెత్త సేకరణ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి డిఎల్‌పిఒ మహ్మద్ రజాఉల్ల తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాటియాకులగూడెం, పి.అంకంపాలెం గ్రామల్లో ఆయన పాల్గొన్నారు. పలు పంచాయతీల్లో హెల్త్ క్యాంపులను, చలి వేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్, సర్పంచి జగ్గారావు జగదాంబ, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీనివాస్, కార్యదర్శులు వీరలక్ష్మి, పద్మ, అశోక్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టి.నర్సాపురం : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని ఎంపిడిఒ జి.మణికుమారి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో కలిసి శనివారం పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి, పిఆర్ ఎఇ సంపత్ కుమారి, జూనియర్ అసిస్టెంట్ పి.శేఖర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ శాఖ వారి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్టేషన్ పరిసర ప్రాంతాలు అన్ని శుభ్రపరిచి మొక్కలు నాటారు. స్టేషన్ ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు, ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : అన్ని గ్రామాల్లో, ప్రజలు స్వచ్ఛందంగా తమ పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు బాధ్యతతో కార్యాలయ ప్రాంగణాలను శుభ్రపరుచుకోవాలని చింతలపూడి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కోంద్రు దేవా, గుమ్మిశెట్టి భారతి సూచించారు. ప్రతినెలా మూడో శనివారం ఏర్పాటుచేసిన స్వచ్ఛంద్రా -స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.నారాయణరావు మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలు ఎండ తీవ్రతకు గురి కాకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రసూల్, డాక్టర్ అజయ్, డాక్టర్ కాశీ, నర్సింగ్ సూపరింటెండెంట్ కృష్ణవేణి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

బుట్టాయగూడెం రూరల్ : కెఆర్.పురం ఐటిడిఎ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ కె.రాములునాయక్ ప్రతిజ్ఞ చేసి వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడుగుంట ఏర్పాటు చేసి కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీగా చాట్రాయి

చాట్రాయి : మండలంలోని చాట్రాయి గ్రామపంచాయతీ పరిసరాల శుభ్రత పాటిస్తూ మొదటి స్థానంలో ఉండడంతో శనివారం గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచి దామెర ఉషను, ఉప సర్పంచి చుండూరి ఆదియ్యను, గ్రామ కార్యదర్శి ఎంవిఎస్.నాగరాజును ఎంపిడిఒ విజయలక్ష్మి శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

ప్రజాశక్తి నూజివీడు టౌన్

నూజివీడు పట్టణ, పరిసర ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని పుణ్యక్షేత్రాల్లో యాత్రికుల కోసం నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి శనివారం కూరగాయలను వితరణగా అందించారు. ఈ సందర్భంగా యాత్రికులు నక్క సత్యనారాయణ, గవిర్నేని ప్రభాకరరావులు మాట్లాడుతూ గడచిన 28 నెలలుగా పుణ్యక్షేత్రాల నిత్యాన్నదాన కార్యక్రమాలకు కూరగాయలను వితరణగా అందిస్తున్నట్లు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదాన కార్యక్రమానికి 12 టన్నులు, చిన్న తిరుపతిగా పేరుగాంచిన ద్వారకాతిరుమల పుణ్యక్షేత్ర నిత్యాన్నదాన కార్యక్రమానికి నాలుగు టన్నులు కూరగాయలను వితరణగా అందించినట్లు చెప్పారు. ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానం వారు ప్రత్యేకమైన వాహనాన్ని పంపినట్లు తెలిపారు. త్వరలో శ్రీశైలం, విజయవాడ పుణ్యక్షేత్రాల అన్నదాన కార్యక్రమానికి కూరగాయలను వితరణగా అందించనున్నట్లు తెలిపారు. నూజివీడు పట్టణ, పరిసర ప్రాంత రైతులు, దాతల సహాయ సహకారంతో పుణ్యక్షేత్రాల్లోని నిత్యాన్నదాన కార్యక్రమానికి కూరగాయలను వితరణగా అందించగలుగుతున్నట్లు వివరించారు.

ఉపాధ్యాయుల డిమాండ్ నెరవేర్చాలి

ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెడుతున్న సంస్కరణలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయుల ఐక్యవేదిక ఉద్యమిస్తుందని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్రప్రసాద్ అన్నారు. పాఠశాల విద్యలో సంస్కరణల పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని బలహీన పరచడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 21న ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారి (డిఇఒ) కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రకటించిందని బేతాళ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ముదినేపల్లిలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 16 డిమాండ్ల నోటీస్‌ను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయంలో ఐక్యవేదిక నాయకులు శుక్రవారం అందించామన్నారు. ఆందోళన కొనసాగింపుగా 23న విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తున్నట్లు తెలిపారు.

సందడిగా వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు


ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు శనివారం 16వ రోజు సందడిగా కొనసాగాయి. గ్రంథాలయ సిబ్బంది పుస్తక పఠనంలో సింహము - కుందేలు నీతి కథలను బోధిస్తూ నీతి సారాంశాన్ని విద్యార్థులచే వివరించారు. యోగా క్లాసులు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ జి.జయలక్ష్మి విద్యార్థులకు ప్రతి పనిలో సమయపాలన, క్రమశిక్షణ, ఎంతో అవసరమన్నారు. రిసోర్స్ పర్సన్ కె.తరుణ్ విద్యార్థులకు సరదా గేమ్స్ ఆడించారు. ఈ శిక్షణా తరగతులను డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ విటి సందీప్‌కుమార్, ఎమ్‌డి అస్లాంపాషా, బిబిఎస్.లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు. శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

కలిదిండి : వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, పుస్తక సమీక్షతో పాటు ధ్యానం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో ధ్యానం చేయించినట్లు శాఖా గ్రంథాలయాధికారి జె.రమేష్‌బాబు తెలిపారు. పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం


కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ఉపాధి కూలీల మస్తర్ల విషయంలో అవకతవకలు గుర్తిస్తే మేట్లతో సహా ఫీల్డ్ అసిస్టెంట్లు చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎంపిడిఒ కె.కిరణ్‌కుమార్ హెచ్చరించారు. బోడిగూడెం రాయుడుచెరువులో ఉపాధి హామీ పనులను ఆయన శనివారం తనిఖీ చేశారు. మస్తర్ల పట్టికను పరిశీలించి ఉపాధి కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి పనుల్లో వారికి అందుకున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కూలీల దాహార్తికి మజ్జిగ అందించారు. ఉపాధి పనుల్లో ఫస్ట్ ఎయిడ్ తప్పనిసరి, అందుకు సంబంధించిన రక్షణ వనరులను సిద్ధం చేసుకుని ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. సర్పంచి కడకట్ల గడ్డియ్య, ఉపసర్పంచి వాసుబోయిన సత్యనారాయణ పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్‌పై సమగ్ర విచారణ చేయాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం దళితవాడలో తన తండ్రి నుంచి సంక్రమించిన స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన వారిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని దళితవాడకు చెందిన కాకర్ల రాము ఇన్‌ఛార్జి తహశీల్దార్ పవన్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం తహశీల్దార్‌ను కలిసి మాట్లాడుతూ వృత్తి రీత్యా ఐదేళ్లుగా తాను విజయవాడలో ఉంటున్నానని తెలిపారు. అయితే తన అయిదు సెంట్ల స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి విఆర్ఓ నుంచి దొంగ పొజిషన్ పత్రాలను పొంది ఆ వ్యక్తి తన ఇరువురు కుమారుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, జిల్లా కలెక్టర్, జిల్లా రిజిస్ట్రర్లకు ఇంటి స్థలం విషయంపై విన్నవించానన్నారు. కనీస ఆధార్ కార్డు, ఏ ఇతర ఆధార పత్రాలు లేకుండా కొన మోహనరావు పేరుతో రిజిస్ట్రేషన్ అయిందన్నారు. దస్తావేజులు లేఖరు, గ్రామ రెవెన్యూ అధికారి విఆర్ఓ సిహెచ్.రామసుబ్బయ్య, విఆర్ఎ బొడ్డు రామ్‌ప్రసాద్ అను వార్లు కలిసి డబ్బులకు ఆశపడి దొంగ దస్తావేజులు రాయించి ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. కొన మోహనరావు, దస్తావేజు లేఖరి, విఆర్ఓ సిహెచ్.రామసుబ్బయ్య, విఆర్ఎ బొడ్డు రామ్ ప్రసాద్‌లపై తగిన చర్యలు తీసుకోవాలని, దస్తావేజు నెంబర్ 4304/2024రు ద.నెం.4305/2024రు దస్తావేజు రెండు రద్దు పరచి నా స్థలాన్ని ఇప్పించాలని కాకర్ల రాము అధికారులను కోరారు.

శ్రీవారి సన్నిధిలో కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల శ్రీవారిని కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం దర్శించుకున్నారు. కలెక్టర్‌కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి అంతరాలయంలో కలెక్టర్ ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు జిల్లా కలెక్టర్‌కు వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు కలెక్టర్‌కు స్వామి వారి తీర్థ ప్రసాదాలను, చిత్రపటాన్ని అందించారు. అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి ఆలయంలోని గోశాలలో గోపూజ చేసి, గోసేవ చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ రమణ, ఆలయ ఇఒ మూర్తి, ఎఇఒ నటరాజన్, తహశీల్దార్ పాల్గొన్నారు.

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సైనికులకు మద్దతుగా జంగారెడ్డిగూడెంలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రోషన్‌కుమార్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కృష్ణారావుపాలెంలో 104 వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని కృష్ణారావుపాలెంలో శనివారం 104 సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించి 40 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు చనుబండ వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. తాగునీరు, మజ్జిగ, ఒఆర్ఎస్ ఎక్కువగా తాగాలన్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు ఇంటి వద్దనే ఉండాలన్నారు. 104 వైద్య శిబిరాన్ని కృష్ణారావుపాలెం ఎంపిటిసి సభ్యులు చింతగుంట్ల వెంకటేశ్వరరావు పరిశీలించారు.

విష్ణువర్ధన్‌కు పితృ వియోగం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని చిగురుకోటకు చెందిన వైసిపి రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్ తండ్రి రామకోటయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, మాజీ ఎంపిపి సంధ్య, వైస్ ఎంపిపిలు సిహెచ్.సునీత, ఆర్.రాధ, వైసిపి మండల నాయకులు ఈడే చిన్నా, పేరే రామకృష్ణ, మొట్రూ యేసుబాబు, శీలం రామకృష్ణ, కోటేశ్వరరావు, లేళ్ల ఆంజనేయులు, సాయి, తదితరులు రామకోటయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరితో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వర్మకు సతివియోగం

మండవల్లి : ప్రముఖ చేపల రైతు భైరవపట్నం ప్రముఖులు గాదిరాజు భాస్కర వర్మకు సతివియోగం కలిగింది. భాస్కర వర్మ సతీమణి భారతికి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో ఇంటి వద్దనే వైద్య సేవలు పొందుతుంది. శుక్రవారం మధ్యాహ్నం ఒకసారిగా అస్వస్థతకు గురై భారతి మరణించారు. విషయం తెలుసుకున్న భైరవపట్నం గ్రామం ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది. భారతీ మృతదేహాన్ని పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సందర్శించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. శనివారం ఉదయం అంతిమ సంస్కారాలు నిర్వహించారు.